## క్లుప్తంగా

### వీధి కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు



వీధి కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

**ఆమదాలవలస:** స్థానిక పురపాలక సంఘం పరిధిలోని వీధి కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ తెలిపారు. పట్టణంలోని మోణింగివారి వీధి, ఐ.జె.నాయుడు కాలనీ, పూజారిపేట, తదితర ప్రాంతాల్లో సోమవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. 33 వీధి కుక్కలకు వ్యాక్సిన్లు వేసినట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ ఆర్.ఆనందరావు తెలిపారు.

### గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా!



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు, సిబ్బంది

**నరసన్నపేట:** జిల్లా కేంద్రంలోనే కాకుండా మండల కేంద్రాల్లోనూ సోమవారాల్లో గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. చాలామంది మండల స్థాయి అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు, కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు డుమ్మా కొట్టారు. మండలంలో 20కి పైగా శాఖలు ఉండగా 11.30కి కల్లా కేవలం 8 శాఖల నుంచే అధికారులు హాజరయ్యారు.

### అంగన్‌వాడీ కార్యకర్త మృతికి సంతాపం



కామేశ్వరి (ఫైల్)

**ఎల్.ఎన్.పేట:** మండలంలోని పూశాం గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త శివ్వాల కామేశ్వరి (45) ఆదివారం రాత్రి మృతి చెందారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ ఏడాది జూన్ నుంచి విధులకు సెలవు పెట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. ఆమెకు భర్త లక్ష్మునాయుడు, కుమారుడు దుష్యంత్ నాయుడు ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు 30వ తేదీన ఇదే అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న ఆయా శార్వాణమ్మ కూడా మృతి చెందారు. అంగన్‌వాడీ కార్యకర్త మృతి పట్ల పలువురు కార్యకర్తలు, ఆయాలు సంతాపం తెలియజేశారు.

### విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి




విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

**హిరమండలం:** విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం హిరమండలం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. విద్యుత్ సర్‌చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, ఇందన సర్దుబాటు పేరుతో చార్జీలు పెంచడం తగదన్నారు. దళితులు, గిరిజనులు, పేదలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి, గతంలో ఉన్న విద్యుత్ చార్జీల బకాయిలు చెల్లించాలని ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు. సీపీఎం నాయకులు ఎస్.అసిరయ్య, సురేష్, కృష్ణ, లక్ష్మి, చిన్నమ్మి పాల్గొన్నారు.

### మద్యం బాటిళ్ల స్వాధీనం


**ఆమదాలవలస:** మండలంలోని రామచంద్రపురం పంచాయతీ పొన్నాంపేటలో 28 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోమవారం దాడి చేశామన్నారు. జి.సూర్యనారాయణ వద్ద అక్రమంగా మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అరెస్టు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**పాతపట్నం మండలంలో..**

**పాతపట్నం:** పాతపట్నం, సింగుపురం గ్రామాల్లో ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు దాడులు చేసి 12 మద్యం బాటిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నారని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు తెలిపారు. పాతపట్నానికి చెందిన వ్యక్తి వద్ద 6 మద్యం బాటిళ్లు, సింగుపురం గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దాడుల్లో పాతపట్నం ఎక్సైజ్ మొబైల్ టీమ్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్‌తో.. ఆరోగ్య భరోసా

- 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచిత ఆరోగ్య బీమా వర్తింపు
- ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం
- ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అమలు
- నియోజకవర్గంలో 28,800 మంది వృద్ధులకు లబ్ధి
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం




ఆయుష్మాన్ భారత్ కింద జారీ చేసిన కార్డు

**పాతపట్నం:** ఆస్పత్రి పాలైతే కూడబెట్టుకున్నదంతా కరిగి పోవాల్సిందే. ఖరీదైన వైద్యం కారణంగా అప్పుల పాలైన కుటుంబాలు ఎన్నో. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే ముందస్తు ఆరోగ్య బీమానే మార్గం. వృద్ధాప్య సమయంలో ఆరోగ్య బీమా ప్రీమియం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో 70 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద ఉచితంగా ఆరోగ్య బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇప్పటివరకు ఈ పథకం కింద పేద, తుక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతోంది. ఇకపై ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు పీఎంజేఏవై కింద రూ.5 లక్షల నగదు రహిత హెల్త్ కవరేజీ లభిస్తుంది.

### ఉచిత బీమా..

- పీఎంజేఏవై పథకాన్ని 2018లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. పేద కుటుంబాలకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు అందుతున్నాయి.
- 70 ఏళ్లు పైబడి.. ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుబాటులో తెచ్చింది.
- అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్యపరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుంది.
- చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారు.
- గుండె సంబంధిత వ్యాధులకు అమర్చే స్టెంట్లు, ఐసీయూ, జనరల్ వార్డులో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుంది.
- రోగికి చికిత్స సమయంలో ఉచితంగా భోజనం అందిస్తారు.
- ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత 15 రోజులపాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయి.
- ఈ పథకం కింద ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారు.
- ప్రస్తుతం 70 ఏళ్లు నిండిన వృద్ధులు www.pmjay.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఆయుష్మాన్ కార్డు పొందవచ్చు.

### సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీఎంజేఏవై ఆరోగ్య బీమాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పేదలందరికీ ఈ పథకం కింద రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోంది. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి కార్డులు జారీ చేశాం. తాజాగా ఆర్థిక, ఆదాయ పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఈ పథకం వర్తింపజేస్తున్నారు. వీరికి కూడా రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది.

– ఎస్.కృష్ణారావు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, పాతపట్నం

| మండలం | పాతపట్నం | మెళియాపుట్టి | కొత్తూరు | హిరమండలం | ఎల్.ఎన్.పేట |
|---|---|---|---|---|---|
| పీహెచ్‌సీలు | 2 | 3 | 2 | 2 | 2 |
| వృద్ధులు | 5,500 | 9,000 | 5,800 | 4,500 | 4,000 |

# కూటమి పాలనలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం



- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**ఎల్.ఎన్.పేట:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. విద్యార్థులకు ఇచ్చే అన్ని సంక్షేమ పథకాలు నిలిపివేసిందన్నారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.20 వేల చొప్పున తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు నమ్మించారని గుర్తుచేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తి యినప్పటికీ తల్లికి వందనం ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు కూడా కాస్మోటిక్ చార్జీలు, పెట్టెలు, కంచాలు, రగ్గులు ఇప్పటికీ అందజేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటే వారి జీవితాలు బాగుపడతాయని భావించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించారని గుర్తుచేశారు. ఆయా కుటుంబాల్లోని విద్యార్థుల చదువులకు అటంకం లేకుండా సకాలంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమచేసినట్లు వివరించారు. విద్యా దీవెన పథకం ద్వారా 29,65,930 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా రూ.12,610 కోట్లు చెల్లించారని తెలిపారు. ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరణ చేసే దిశగా సీఎం చంద్రబాబు పావులు కదుపుతున్నారన్నారు. పల్లె పండగ పేరుతో కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆర్థికంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ ధనాన్ని దోచిపెడుతున్నారన్నారు. ఇసుక దోపిడీతో కూటమి నాయకులు కోట్లు కూడగడుతున్నారని ఆరోపించారు.

# గ్యాస్ ఏజెన్సీపై విచారణ చేపట్టాలని కోరుతాం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేష్


**పొందూరు:** స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీపై డీఎస్‌ఓకు ఫిర్యాదు చేసి విచారణ జరపాలని కోరుతానని ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కిల్లి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గ్యాస్ సకాలంలో సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తహసీల్దార్ దృష్టికి పొందూరు–2 ఎంపీటీసీ అనకాపల్లి వాణి తీసుకువచ్చారు. గ్యాస్ ధరకంటే రూ.30 అధికంగా ఇస్తున్నప్పటికీ సరిపోవడం లేదని, రూ.50 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కింతలి పీహెచ్‌సీ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతోపాటు, గేటు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపీటీసీ కూటికుప్పల హనుమంతురావు అధికారులకు తెలియజేశారు. పెనుబర్తి పంచాయతీలో కార్యదర్శికి, వార్డు సభ్యులకు తెలియకుండా పంచాయతీ ఖాతా నుంచి సర్పంచ్ నగదు డ్రా చేశారని ఈఓపీఆర్డీ సింహాచలంకు ఎంపీటీసీ సభ్యురాలు కూన ప్రమీల ఫిర్యాదు చేశారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో రూ.15 కోట్లతో చేపట్టనున్న పనులకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఎంపీడీఓ మన్మధరావు, ఏఓ బీబీ మిత్రీ, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



మెళియాపుట్టి మండలం సవరకొత్తూరు గ్రామంలో టెక్కలి, నరసన్నపేట ఎక్సైజ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించినట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ తెలిపారు. 500 లీటర్ల పులిసిన బెల్లం ఊట ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను, సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. టెక్కలి, నరసన్నపేట ఎస్‌ఐలు సత్యనారాయణమూర్తి, గురుమూర్తి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. - మెళియాపుట్టి

### వాహన తనిఖీలు



కొత్తూరు ఎంపీడీఓ కార్యాలయం కూడలి వద్ద కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. సరైన పత్రాలులేని 15 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేశారు. మద్యం తాగి, హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్తూరు ఎస్‌ఐ అమీర్ అలీ, పోలీసులు పాల్గొన్నారు.

- కొత్తూరు

### చేప పిల్లల విడుదల



ఎల్.ఎన్.పేట మండలంలోని చొర్లంగి పంచాయతీ పరిధిలోని గిరిజనులకు జిల్లా మత్స్యశాఖ డీడీ పి.వి.శ్రీనివాస్ సోమవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. జంబాడ, కొత్తబాలేరు, గోలుకుప్ప, సరడాం, చొర్లంగి, గార్లపాడు, బిడ్డికిపేట, కొత్త జోగివలస, జోగివలస, కారిగూడ తదితర గ్రామాల్లోని 26 చెరువుల్లో 30,700 చేప పిల్లలను విడిచిపెట్టామన్నారు. సీతంపేట ఐటీడీఏ గిరిజన సబ్ ప్లాన్ నిధులతో పూర్తి రాయితీపై చేపపిల్లలను గిరిజనులకు అందజేశామన్నారు. మత్స్యశాఖ ఏడీ టి.సంతోష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. - ఎల్.ఎన్.పేట

### అలత్వం వహిస్తే చర్యలు



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కార్యకర్తలు అలత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి అన్నారు. జలుమూరు మండలం శ్రీముఖలింగం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, కార్యకర్తలు చంద్రకళ, మాలతి, భవానీ పాల్గొన్నారు.

- జలుమూరు

# శంభో శంకర

కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివనామం మార్మోగింది. వేకువ జామునుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పలుచోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్జ: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: అంగూరులోని కుంభేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



నరసన్నపేట: సంతపేటలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



హిరమండలం: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగేశ్వర ఆలయం లోపల వేచి ఉన్న భక్తులు



పాతపట్నం: మంజునాథ ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస: రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

### ఈ కారు ఎవరిది?



కొత్తూరు మండల కేంద్రంలోని బత్తిలి రోడ్డులో గల అగ్నిమాపక కేంద్రం సమీపంలో చాలా రోజుల నుంచి ఓ కారు ఉంది. ఈ కారును ఎవరూ తీసుకువెళ్లడం లేదు. ఈ కారు ఎవరిదన్నది పరిసర ప్రాంత వాసులతోపాటు పలువురు షాపు నిర్వాహకులు చర్చించుకుంటున్నారు. పోలీసులు ఈ కారును పరిశీలిస్తే ఎవరిదో తెలియడంతోపాటు, అసలు ఈ కారు ఇక్కడ ఎందుకు ఉందనే విషయం కూడా తెలుస్తుందన్నారు.

- కొత్తూరు

### లింగ సమానత్వం సాధించాలి



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, మహిళలు

**నరసన్నపేట:** మహిళలపై జరుగుతున్న హింసను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, దీనిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం జరగాలని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింసా నిరోధక దినోత్సవం సందర్భంగా నరసన్నపేటలో సోమవారం మహిళలు ర్యాలీ చేపట్టారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనన్నారు. ఎంపీడీఓ బి.మధుసూదనరావు, నరసన్నపేట ఏపీఎం అప్పలనర్సయ్య, ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్, వీఓఏలు పాల్గొన్నారు.

**పాతపట్నం:** స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ఎంపీడీఓ చంద్రకుమారితో కలిసి వెలుగు ఏపీడీ సన్యాసిరావు ప్రారంభించారు. విద్యార్థులతో హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి కోర్టు కూడలి వరకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. డీపీఎం ఆర్.వి.రమణ, ఎంఈఓ తిరుమలరావు, ఏపీఎంలు పార్వతి, సాయిలక్ష్మి, మహిళా సంఘ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి:** లింగ ఆధారిత వివక్ష, హింస సరికాదని ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా, పలువురు అధికారులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు, వెలుగు ఏపీఎం త్రినాథమ్మ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**సారవకోట:** మండల కేంద్రంలో లింగ సమానత్వంపై వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కొత్తూరు:** బాల్య వివాహాలను అరికట్టేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ లలిత అన్నారు. కొత్తూరులో లింగ సమానత్వంపై ర్యాలీని ప్రారంభించారు. ఎంఎంఎస్ కార్యాలయం నుంచి కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

**జలుమూరు:** బాలికలను ఉన్నత చదువులు చదివిద్దామని ఎంపీడీఓ అప్పలనాయుడు అన్నారు. వెలుగు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో లింగ సమానత్వంపై ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ రామారావు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఏపీఎం హేమసుందరరావు, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దళారులకు ధాన్యం విక్రయించొద్దు



కరగాం వద్ద రైతులు, కొనుగోలు కేంద్రం ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసరావు

**నరసన్నపేట:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నాం, ప్రజాప్రతినిధులతో ప్రారంభిస్తాం, రైతులు తొందరపడి ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని సివిల్ సప్లయ్ డీఎం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కరగాం, కంబకాయ, పెద్దకరగాం గ్రామాల్లో ధాన్యం నిల్వలను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టాలని సూచించారు. మరో వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధమవుతాయన్నారు. ప్రస్తుతం నరసన్నపేట, పోలాకి, ఎల్.ఎన్.పేట మండలాల్లో ఒక్కో కొనుగోలు కేంద్రం సిద్ధం చేశామన్నారు. వీటిల్లో కొనుగోళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. మొక్కుబడిగా కాకుండా పూర్తిస్థాయిలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. వాతావరణం మారుతున్నందున ధాన్యం నిల్వ చేసేందుకు గిడ్డంగులు లేవని రైతులు వాపోయారు. డీఎం రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఏఓ కె.సునీత, సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# రుషికొండ నిర్మాణాలపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న సూర్యనారాయణ, నాయకులు

**కొత్తూరు:** విశాఖపట్నం జిల్లా రుషికొండపై దేశంలోనే అత్యాధునిక పద్ధతిలో నాణ్యతాప్రమాణాలు పాటించి గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలపై కూటమి నేతలు విమర్శించడం సరికాదని వైఎస్సార్‌సీపీ నేత, కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. దేశంలోనే ఇంతవరకు ఇటువంటి భవనాలు ఎక్కడా నిర్మించలేదన్నారు. కూటమి నేతలు ఓర్వలేకే చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. అమరావతిలో రాజధాని పేరు చెప్పి సీఎం చంద్రబాబు.. సచివాలయంతోపాటు పలు ప్రభుత్వ భవనాలను తాత్కాలికంగా నిర్మించి వేలాది కోట్లు వృథా చేశారని ఆరోపించారు. సింగపూర్ తరహా రాజధాని నిర్మిస్తామని ప్రజలకు సినిమా చూపించి, ప్రభుత్వ ధనాన్ని లూటీ చేశారన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర వడమ శ్రీనివాసరావు, పాతపట్నం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గిరడ వంశీ, మాజీ ఉప సర్పంచ్ ఎద్దు హరిదాసు పాల్గొన్నారు.

### వరి కోతలు వాయిదా వేసుకోవాలి

**హిరమండలం:** తుఫాన్ ప్రభావం తగ్గే వరకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఏఓ బి.సంధ్య సూచించారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26, 27 తేదీల్లో తుఫాన్ ప్రభావం వలన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే వరి కోతలు కోసిన రైతులు పొలాల్లోనే కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### వైభవంగా తెప్పోత్సవం



నరసన్నపేట పట్టణంలోని గోరువాని చెరువులో భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి వారి తెప్పోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. చెరువు మధ్యలో ఉన్న పరమేశ్వరుడి విగ్రహం చెంతకు తెప్పను తీసుకువెళ్లారు. మల్లిఖార్జున స్వామి ఉత్సవ విగ్రహాలకు తిరివీధి నిర్వహించిన అనంతరం తెప్పోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భవానీపురానికి చెందిన యువజన సంఘం ప్రతినిధులు రెండు రోజులుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్చకుడు దుర్గామల్లికార్జున స్వామి, వార్డు సభ్యులు బీఎల్ శర్మ, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట